25-07-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - దేహాభిమానాన్ని వదిలి ఆత్మాభిమానులుగా అవ్వండి. ఆత్మాభిమానులనే ఈశ్వరీయ సంప్రదాయనికి చెందినవారని అంటారు "

**ప్రశ్న :-** పిల్లలైన మీరిప్పుడు ఏ సత్సంగమునైతే చేస్తున్నారో, అది ఇతర సత్సంగాల కంటే భిన్నమైనది, ఎలా ?

**జవాబు :-** ఈ ఒక్క సత్సంగములో మాత్రమే మీరు ఆత్మ-పరమాత్మల జ్ఞానము వింటారు. ఇక్కడ చదువు ఉంటుంది. లక్ష్యము కూడా ఎదురుగా ఉంటుంది. ఇతర సత్సంగాలలో చదువూ ఉండదు, ఏ లక్ష్యమూ ఉండదు.

**ఓంశాంతి.** ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి అర్థము చేయిస్తున్నారు, ఆత్మిక పిల్లలు వింటున్నారు. మొట్టమొదట తండ్రి తెలియజేస్తున్నారు - ఎప్పుడు కూర్చున్నా స్వయాన్ని ఆత్మగా భావించి కూర్చోండి. దేహమని భావించకండి. దేహాభిమానము కలిగినవారిని ఆసురీ సంప్రదాయము వారని అంటారు. ఆత్మాభిమానులను ఈశ్వరీయ సంప్రదాయము వారని అంటారు. ఈశ్వరునికి దేహమే లేదు. ఈశ్వరుడు సదా ఆత్మాభిమానిగానే ఉంటాడు. వారు శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన(సుప్రీం) ఆత్మ, ఆత్మలందరికీ తండ్రి. పరమాత్మ అంటే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైనవారు. మానవులు భగవంతుడు అత్యంత ఉన్నతమైన వారని అన్నప్పుడు వారి బుద్ధిలోకి నిరాకార లింగ రూపము వస్తుంది. నిరాకార లింగానికి పూజ కూడా చేస్తారు. వారు పరమాత్మ లేక ఆత్మలందరి కంటే శ్రేష్ఠమైనవారు. వారు కూడా ఆత్మనే కాని అత్యంత శ్రేష్ఠమైన ఆత్మ. వారు జనన-మరణాలలోకి రారు. మిగిలిన వారందరూ పునర్జన్మలు తీసుకుంటారు. మిగిలినవారందరూ వారి రచన. రచయిత నిశ్చయంగా ఒక్క తండ్రియే. బ్రహ్మ-విష్ణు-శంకరులు కూడా వారి రచనే. మనుష్య సృష్టి అంతా వారి రచనయే. తండ్రిని రచయిత అని అంటారు. పురుషుని కూడా రచయిత అని అంటారు. స్త్రీని దత్తు తీసుకుంటాడు. తర్వాత ఆమె ద్వారా పిల్లలను రచిస్తాడు, పాలన చేస్తాడు. వినాశనము చేయడు. ఇతర ధర్మస్థాపకులు కూడా రచిస్తారు, పాలన చేస్తారు. ఎవ్వరూ వినాశనము చేయరు. పరమాత్మను అనంతమైన తండ్రి అని అంటారు. ఎలాగైతే ఆత్మ బిందు రూపంలో ఉంటుందో, అలా పరమపిత పరమాత్మ కూడా బిందు రూపంలో ఉంటాడు. భక్తి మార్గములో పూజ చేసేందుకు పెద్ద లింగాన్ని తయారు చేస్తారు. బిందువుకు పూజ ఎలా జరుగుతుంది? భారతదేశములో రుద్ర యజ్ఞాన్ని రచిస్తారు. మట్టితో శివలింగాన్ని, సాలిగ్రామాలను చేసి పూజిస్తారు. దానిని రుద్ర యజ్ఞమని అంటారు. వాస్తవానికి దాని పేరు రాజస్వ అశ్వమేధ అవినాశి రుద్ర గీతా జ్ఞాన యజ్ఞము. ఈ మాట శాస్త్రాలలో కూడా వ్రాయబడి ఉంది. పిల్లలకు తండ్రి చెప్తున్నారు - స్వయాన్ని ఆత్మగా భావించండి. ఇతర సత్సంగాలలో ఆత్మ-పరమాత్మల జ్ఞానము ఎవ్వరిలోనూ లేదు, ఎవ్వరూ ఇవ్వలేరు.

అక్కడ ఒక లక్ష్యమనేది ఉండదు. పిల్లలైన మీరిప్పుడు చదువును చదువుతున్నారు. ఆత్మ శరీరంలో ప్రవేశిస్తుందని మీకు తెలుసు. ఆత్మ అవినాశి, శరీరము వినాశి. శరీరము ద్వారా పాత్ర చేస్తుంది. ఆత్మ అశరీరి కదా. నగ్నంగా వచ్చాము, నగ్నంగా వెళ్ళాలని కూడా అంటారు. శరీరాన్ని ధారణ చేశాము. మళ్ళీ శరీరాన్ని వదిలి నగ్నంగా వెళ్ళాలి. ఈ తండ్రి కూర్చుని పిల్లలైన మీకు మాత్రమే అర్థము చేయిస్తారు. భారతదేశములో సత్యయుగముండేదని, దేవీ దేవతల రాజ్యముండేదని, ఒకే ధర్మముండేదని కూడా పిల్లలైన మీకు తెలుసు. ఇది కూడా భారతవాసులకు తెలియదు. తండ్రిని ఎవరైతే తెలుసుకోలేదో వారికేమీ తెలియదు. ప్రాచీన ఋషులు, మునులు కూడా మాకు రచయిత-రచనల గురించి తెలియదని చెప్పేవారు. రచయిత అనంతమైన తండ్రి. వారికి మాత్రమే రచన ఆదిమధ్యాంతాలను గురించి తెలుసు. ఆదిని ప్రారంభమని, మధ్య సమయానికి మధ్యము అని అంటారు. ఆది అంటే సత్యయుగము. దీనిని పగలు అని అంటారు. తర్వాత మధ్యము నుండి అంత్యము వరకు రాత్రి అని అంటారు. సత్య-త్రేతా యుగాలు పగలు. స్వర్గము అద్భుతమైన ప్రపంచము. భారతదేశమే స్వర్గంగా ఉండేది. అందులో లక్ష్మీనారాయణులు రాజ్య పాలన చేసేవారు. దీనిని గురించి భారతవాసులకు తెలియదు. తండ్రి ఇప్పుడు స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు.

తండ్రి చెప్తున్నారు - మీరు స్వయాన్ని ఆత్మగా భావించండి. నేను ఫస్ట్‌క్లాస్ ఆత్మను. ఈ సమయంలో మనుష్యులందరు దేహాభిమానులుగా ఉన్నారు. తండ్రి ఆత్మాభిమానులుగా చేస్తారు. ఆత్మ అంటే ఏమిటో కూడా తండ్రి అర్థము చేయిస్తున్నారు. మనుష్యులకు ఏమీ తెలియదు. భృకుటి మధ్యలో నక్షత్రములాగా ప్రకాశిస్తూ ఉంటుందని అంటారు. కాని అది ఏమిటో, దానిలో పాత్ర ఎలా నిండి ఉందో వారికి ఏమీ తెలియదు. ఇప్పుడు మీకు తండ్రి అర్థము చేయించారు - భారతవాసులైన మీరు 84 జన్మల పాత్ర చేయాల్సి వస్తుంది. భారతదేశమే శ్రేష్ఠమైన ఖండము. మనుష్యులందరికి ఇది తీర్థ స్థానము. సర్వులకు సద్గతినిచ్చేందుకు తండ్రి ఇక్కడకు వస్తారు. రావణ రాజ్యము నుండి ముక్తిని కలిగించి మార్గదర్శకులై తీసుకెళ్తారు. మానవులు కూడా ఇలాగే చెప్తారు. కాని వారికి అర్థము ఏ మాత్రము తెలియదు. భారతదేశములో మొట్టమొదట దేవీ దేవతలుండేవారు. వారే మళ్ళీ పునర్జన్మలు తీసుకోవలసి వస్తుంది. భారతవాసులే దేవతలుగా, తర్వాత క్షత్రియులుగా, వైశ్యులుగా, శూద్రులుగా అవుతారు. పునర్జన్మలు తీసుకుంటారు కదా, ఈ జ్ఞానాన్ని పూర్తిగా తెలుసుకునేందుకు 7 రోజులు పడ్తుంది. పతిత బుద్ధిని పావనంగా చేయాలి. ఈ లక్ష్మీనారాయణులే పావన ప్రపంచములో రాజ్యము చేసేవారు కదా. వారి రాజ్యమే భారతదేశములో ఉండేది. అప్పుడు ఏ ఇతర ధర్మమూ లేదు. ఒకే రాజ్యముండేది. భారతదేశము ఎంతో సంపన్నంగా ఉండేది. వజ్ర వైఢూర్యాల మహళ్ళు ఉండేవి. తర్వాత రావణ రాజ్యములో పూజారులుగా అయ్యారు. మళ్ళీ భక్తి మార్గములో ఈ మందిరాలు మొదలైనవి తయారు చేశారు. సోమనాథుని మందిరము ఉండేది కదా. ఒక్క మందిరమే ఉండదు. ఈ శివుని మందిరంలో ఎన్ని వజ్ర వైఢూర్యాలుండేవంటే మహమ్మద్ గజనీ ఒంటెల పై నింపుకొని తీసుకెళ్ళాడు. అంత

సంపద ఉండేది. ఒక్క ఒంటె ఏమిటి లక్షల ఒంటెలను తీసుకొచ్చినా నింపుకోలేనంత తరగని సంపద ఉండేది. సత్యయుగములో బంగారు, వజ్ర వైఢూర్యాల మహళ్ళు అనేకం ఉండేవి. మహమ్మద్ గజనీ అయితే ఇప్పుడొచ్చాడు. ద్వాపరంలో కూడా ఎన్నో మహళ్ళు మొదలైనవి ఉంటాయి. అవి మళ్లీ భూకంపములో లోపలికి వెళ్ళిపోతాయి. రావణునికి ఏ స్వర్ణిమ లంక ఉండదు. రావణ రాజ్యంలో భారతదేశ పరిస్థితి ఇలా అయిపోతుంది. 100 శాతము అధర్మము, అసంపన్నంగా, పతిత వికారులుగా అయినారు. కొత్త ప్రపంచాన్ని నిర్వికార ప్రపంచమని అంటారు. భారతదేశము శివాలయంగా ఉండేది. దీనిని అద్భుతమైన ప్రపంచమని(వండర్ ఆఫ్ వరల్డ్) అంటారు. మనుష్యులు చాలా కొద్దిమందే ఉండేవారు. ఇప్పుడు కోట్లాది మంది మనుష్యులున్నారు. ఇది ఆలోచించే విషయము కదా. ఇప్పుడు పిల్లలైన మీకిది పురుషోత్తమ సంగమ యుగము. ఈ సమయంలో తండ్రి మిమ్ములను ఉత్తమ పురుషులుగా, బంగారు బుద్ధి గలవారిగా చేస్తున్నారు. తండ్రి మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు మీకు మంచి మతాన్ని ఇస్తారు. తండ్రి మతానికే “ మీ గత్-మత్ భిన్నమైనది ” అని మహిమ చేస్తారు. దీని అర్థము కూడా ఎవ్వరికీ తెలియదు. తండ్రి చెప్తున్నారు - నేను ఇచ్చే శ్రేష్ఠ మతము ద్వారా మీరు దేవతలుగా అవుతారు. ఇప్పుడు కలియుగము పూర్తి అవుతుంది. పాత ప్రపంచ వినాశనము ఎదురుగా నిలబడి ఉంది. మనుష్యులు పూర్తి అంధకారములో కుంభకర్ణుని నిద్రలో నిద్రపోతున్నారు. ఎందుకంటే శాస్త్రాలలో కలియుగము ఇంకా చిన్న బిడ్డగా ఉందని, ఇంకా 40 వేల సంవత్సరాలు ఉందని వ్రాసేశారు. 84 లక్షల యోనులని భావించిన కారణంగా కల్పము ఆయువును చాలా ఎక్కువగా చేసేశారు. వాస్తవానికి కల్పము ఆయువు 5 వేల సంవత్సరాలు. మీరు 84 లక్షలు కాదు, కేవలం 84 జన్మలు మాత్రమే తీసుకుంటారని తండ్రి అర్థము చేయిస్తున్నారు. అనంతమైన తండ్రికి ఈ శాస్త్రాలు మొదలైనవన్నీ తెలుసు. అందుకే ఇవన్నీ భక్తిమార్గములోనివని చెప్తారు. ఇది అర్ధకల్పము నడుస్తుంది. భక్తి ద్వారా నన్ను ఎవ్వరూ కలువలేరు. ఇది కూడా ఆలోచించవలసిన విషయము. ఒకవేళ కల్పము ఆయువు లక్షల సంవత్సరాలైతే జన సంఖ్య కూడా ఎక్కువగా ఉండాలి కదా. క్రైస్తవుల సంఖ్య 2000 సంవత్సరాలలోనే ఇంత ఎక్కువగా ఉంది! భారతదేశము అసలైన ధర్మము దేవీ దేవతా ధర్మము. అది కొనసాగుతూ వచ్చి ఉండాలి. కాని ఆదిసనాతన దేవీ దేవతా ధర్మమును మర్చిపోయినందున మాది హిందూ ధర్మమని చెప్తారు. హిందూ ధర్మమనేది లేనే లేదు. భారతదేశము ఎంతో ఉన్నతంగా ఉండేది. ఆదిసనాతన దేవీదేవతా ధర్మము విష్ణుపురిలో ఉండేది. ఇప్పుడిది రావణపురి. అదే దేవతలు, 84 జన్మల తర్వాత ఏమైపోయారు? దేవతలను నిర్వికారులని భావిస్తూ స్వయాన్ని వికారులుగా భావించి వారిని పూజిస్తారు. సత్యయుగంలో భారతదేశము నిర్వికారిగా ఉండేది. కొత్త ప్రపంచముగా ఉండేది. దీనినే నూతన భారతదేశమని అంటారు. ఇది పాత భారతదేశము. కొత్త భారతదేశమంటే ఎలా ఉండేది? పాత భారతదేశము ఎలా ఉంది? కొత్త ప్రపంచములో భారతదేశమే కొత్తదిగా ఉండేది. ఇప్పుడు పాత ప్రపంచములో భారతదేశము కూడా పాతదైపోయింది. ఏ గతి పట్టింది? భారతదేశమే స్వర్గంగా ఉండేది, ఇప్పుడు

నరకమైపోయింది. భారతదేశము చాలా సంపన్నంగా ఉండేది. అదే భారతదేశము అత్యంత అసంపన్నమైపోయింది(దివాలా తీసింది). అందరి వద్ద భిక్షమడుగుతున్నారు. ప్రజల నుంచి కూడా భిక్షమడుక్కుంటున్నారు. ఇది అర్థము చేసుకోవాల్సిన విషయం కదా. ఈ సమయంలో దేహాభిమానములోని మనుష్యులకు కొద్దిగా ధనము లభించిందంటే మేము స్వర్గములో కూర్చుని ఉన్నామని భావిస్తారు. సుఖధామము(స్వర్గము) గురించి బొత్తిగా తెలియదు. ఎందుకంటే రాతిబుద్ధి గలవారిగా ఉన్నారు. ఇప్పుడు వారిని బంగారు బుద్ధిగా చేసేందుకు 7 రోజుల భట్టీలో కూర్చోపెట్టండి. ఎందుకంటే పతితులుగా అయ్యారు కదా! పతితులను ఇక్కడ కూర్చోబెట్టలేరు. ఇక్కడ పావనంగా అయిన వారే ఉండగలరు. పతితులకు అనుమతినివ్వలేరు.

మీరిప్పుడు పురుషోత్తమ సంగమ యుగములో కూర్చొని ఉన్నారు. బాబా మనలను ఇలాంటి ఉత్తమ పురుషులుగా తయారు చేస్తున్నారని మీకు తెలుసు. ఇది సత్యమైన సత్యనారాయణ కథ. సత్యమైన తండ్రి మీకు నరుని నుండి నారాయణునిగా అయ్యే రాజయోగాన్ని నేర్పిస్తున్నారు. జ్ఞానము కేవలం ఒక్క తండ్రి వద్ద మాత్రమే ఉంది. వారిని జ్ఞానసాగరులని అంటారు. శాంతి సాగరులు, పవిత్రతా సాగరులు అను మహిమ వారికొక్కరికే ఉంది. వేరే ఎవ్వరికీ ఈ మహిమ లేదు. దేవతల మహిమ వేరు. పరమపిత పరమాత్మ శివుని మహిమ వేరు. వారు మన తండ్రి. తండ్రి అని కృష్ణుని అనరు. భగవంతుడనగా ఎవరో ఇప్పటికి కూడా భారతవాసులకు తెలియదు. కృష్ణ భగవానువాచ అని అనేస్తారు. కృష్ణుడు పూర్తి 84 జన్మలు తీసుకుంటాడు. సూర్య వంశము నుండి చంద్ర వంశములోకి, చంద్ర వంశము నుండి వైశ్య వంశములోకి వస్తాడు. హం సో, సో హమ్ అంటే ఏమో మనుష్యులకు తెలియదు. ఆత్మ అయిన నేనే పరమాత్మ అని అనేస్తారు. ఇది ఎంత పెద్ద తప్పు. భారతదేశానికి ఉన్నతమయ్యే కళ, దిగే కళ ఎలా అవుతుందో ఇప్పుడు మీకు తెలుసు. ఇది జ్ఞానము, అదంతా భక్తి. సత్యయుగంలో అందరూ పావనంగా ఉండేవారు. రాజా - రాణుల రాజ్యము నడిచేది. అక్కడ మంత్రులు కూడా ఉండరు. ఎందుకంటే స్వయం రాజా - రాణులే అధికారులు. తండ్రి నుండి వారసత్వము తీసుకున్నవారు. వారిలో తెలివి ఉంది. లక్ష్మీ నారాయణులకు ఎవరి సలహా తీసుకోవలసిన అవసరము లేదు. అక్కడ మంత్రులుండరు. భారతదేశములాంటి పవిత్ర దేశము ఏదీ లేదు. మహాన్ పవిత్ర దేశము. దాని పేరే స్వర్గము. ఇప్పుడిది నరకము. నరకము నుండి మళ్లీ స్వర్గంగా తండ్రే తయారుచేస్తారు. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ఒక్క తండ్రి తెలిపే మంచి మతమునునుసరించి మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలి. ఈ సౌభాగ్య(కళ్యాణకారి) సంగమ యుగములో స్వయాన్ని పురుషోత్తములుగా, బంగారుబుద్ధి గలవారిగా తయారు చేసుకోవాలి.

2. 7 రోజుల భట్టీలో కూర్చొని పతిత బుద్ధిని పావన బుద్ధిగా తయారు చేసుకోవాలి. సత్యమైన తండ్రి వద్ద సత్యమైన సత్యనారాయణ కథ విని నరుని నుండి నారాయణునిగా అవ్వాలి.

## వరదానము :- " ఫరిస్తా స్థితి ద్వారా తండ్రి స్నేహానికి రిటర్న్ (ప్రతిఫలము) ఇచ్చే సమాధాన స్వరూప్ భవ "

ఫరిస్తా స్థితిలో స్థితమవ్వడమే తండ్రి స్నేహానికి రిటర్న్, ఇలా రిటర్న్ ఇచ్చేవారు సమాధాన స్వరూపులుగా అవుతారు. సమాధాన స్వరూపులుగా అవ్వడం వలన స్వయం లేక ఇతర ఆత్మల సమస్యలు స్వతహాగా సమాప్తమైపోతాయి. కనుక ఇప్పుడీ సమయం అటువంటి సేవ చేసే సమయము. తీసుకోవడంతో పాటు ఇచ్చే సమయము. అందువలన ఇప్పుడు తండ్రి సమానం ఉపకారులుగా అయి ఆక్రందనలు విని మీ ఫరిస్తా స్వరూపము ద్వారా ఆ ఆత్మల వద్దకు చేరుకొని సమస్యలతో అలిసిపోయిన ఆత్మల అలసటను దూరం చేయండి.

## స్లోగన్:- " వ్యర్థము నుండి నిర్లక్ష్యమవ్వండి, మర్యాదల నుండి కాదు. "